మిర్చి మిగిల్చిన నష్టం..

- నష్టాల ఊబిలో నర్సరీల యజమానులు
- సాగు తగ్గడంతో మూత పడుతున్న వైనం..
- ఈ ఏడాది రైతులు ఇచ్చిన విత్తనాలతోనే నరి


తల్లాడ నర్సరీలో రైతులిచ్చిన విత్తన ప్యాకెట్ల ద్వారా పెంచుతున్న నారు

తల్లాడ: గతేడాది పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ఈ ఏడాది మిర్చి సాగుకు రైతులు విముఖత చూపడంతో ఆ ప్రభావం నర్సరీలపై పడుతుంది. దీంతో మిర్చి నర్సరీ యజమానులు ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో పడ్డారు. ఈ ఖరీఫ్ సీజన్లో మిర్చి నర్సరీలు ఒక్కోటిగా మూత పడుతున్నాయి. నర్సరీల్లో మిర్చి నారు పెంచకుండానే వదిలేస్తున్నారు. నర్సరీలకు బై చెబుతున్నారు.

తగ్గిన మిర్చిసాగు..
ఈ ఏడాది మిర్చి సాగు గణనీయంగా తగ్గుతోంది. గతేడాది ఆరువేల ఎకరాల్లో సాగు చేసిన మిర్చి రైతులు ఈ ఏడాది 1,500 ఎకరాలకు మించకపోవచ్చని వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారుల అంచనా. జూన్ నెలలో నాటిన మిర్చి నారు ఆగస్టు ఫస్ట్ వారంలో చేతికొస్తుంది. దీంతో రైతులు నారును తీసుకెళ్లి మిర్చిపైరు వేసేందుకు సిద్ధం చేసిన పొలాల్లో నాటుతారు. అయితే ఈఏడాది తక్కువ మంది రైతులు మిర్చిసాగు చేసేందుకు మక్కువ చూపిస్తున్నారు. గతేడాది మిర్చి ధర క్వింటా రూ.14వేలు మాత్రమే ధర పలికింది. నల్ల తామర కారణంగా దిగుబడి తగ్గడంతో మిర్చి రైతులు నష్టాలను చవి చూశారు. కూలీల ఖర్చు పెరగడంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది.

భర్తీ కాని పెట్టుబడులు..
మిర్చిపంట ఎకరానికి రూ. 1.50 లక్షలు పెట్టుబడి పెట్టిన రైతులకు పెట్టుబడులు కూడా భర్తీకాని పరిస్థితి. ఎకరానికి మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల మాత్రమే దిగుబడి రావటంతో 50శాతం మేర రైతులు అప్పుల పాలయ్యారు. 50శాతం మంది రైతులకు మాత్రమే పెట్టుబడులు వచ్చాయి. ఇక కౌలు రైతులు రెండు రకాలుగా నష్టపోవడంతో ఈ సారి సాగుకు ముందుకు రాలేదు. ఊరికి పదిమంది రైతులే తమకున్న భూమిలో మిర్చి సాగుచేయగా మరికొంతమంది పత్తి, మొక్కజొన్న, పంటల వైపు మొగ్గుచూపుతున్నారు.

నష్టాల బాటలో మిర్చి నర్సరీలు..
తల్లాడ మండలంలో మొత్తం 40 వరకు మిర్చి నర్సరీలు ఉన్నాయి. ఒకప్పుడు సిరులు కురిపించిన మిర్చి నర్సరీలు గతేడాది తీవ్ర నష్టాలను చవి చూశారు. మిర్చినారు అమ్ముడుపోక నారు పీకేశారు. తల్లాడ, నారాయణపురం, కుర్నవల్లి, ముద్దునూరు, రామానుజవరం, మిట్టపల్లి, అన్నారుగూడెం, రెడ్డిగూడెం, పినపాక పరిసర గ్రామాల్లో 40వరకు విస్తరించిన నర్సరీల్లో పది వరకు మూసి వేసేందుకు సిద్ధమయ్యాయి. రెడ్డిగూడెం సమీపంలోని ఓ నర్సరీ యజమానికి గత సంవత్సరం నారు మిగిలి రూ.50 లక్షల మేర నష్టం వాటిల్లింది. దీంతో రైతుల ఇచ్చిన విత్తనాలనే నర్సరీ యజమానులు పెంచి నారును రైతులకిస్తున్నారు. దీంతో నష్టపోయే పరిస్థితి ఉండదు.

రైతులిచ్చిన విత్తనాలనే..



ఈ ఏడాది మిర్చి సాగు గణనీయంగా తగ్గింది. గత సంవత్సరం నారు మిగిలి వృధా కావటంతో ఈ సంవత్సరం కూడా నష్ట పోకుండా కొద్దిమంది రైతులు తమ భూముల్లో మిర్చిసాగు చేసేందుకు తేజ రకాల విత్తన ప్యాకెట్లు ఇచ్చారు. ట్రేకు రూ.50 చొప్పున నారు పెంచి ఇస్తున్నాం. మిర్చి సాగు పట్ల రైతులు విముఖత వ్యక్తం చేస్తున్నారు.

– జీడిమళ్ల కిషోర్‌రెడ్డి, నారాయణపురం, నర్సరీ యజమాని

నష్టపోతున్న నర్సరీ యజమానులు..



మిర్చి సాగు గణనీయంగా తగ్గడంతో నర్సరీ యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది తామరతో దిగుబడి తగ్గడం, ధర లేకపోవటం వల్ల వచ్చిన నష్టానికి భయపడి ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపుతున్నారు. మిర్చి స్థానంలో పత్తి, మొక్కజొన్న సాగు చేస్తున్నారు. మిర్చి నర్సరీలకు కూడా తీవ్ర నష్టం రావడంతో నారు పెంచడానికి విముఖత చూపుతున్నారు.

– నగేష్, ఇన్‌చార్జ్ హార్టికల్చర్ అధికారి

క్లుప్తంగా

ఉత్తమ పౌరులుగా ఎదగాలి


మాట్లాడుతున్న న్యాయవాది సుబ్రహ్మణ్యం

మధిర: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండి భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ప్రముఖ న్యాయవాది దేవరపల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు. అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా బుధవారం మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. భారత న్యాయ సంహిత, పోక్సో, బాల నేరాలు, సైబర్, ఆర్థిక నేరాలు, మత్తు పదార్థాలు, స్మగ్లింగ్ తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తోట నరసింహారావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ వేమిరెడ్డి నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు


సభ్యత్వాలు తీసుకుంటున్న వల్లబి పాఠశాల ఉపాధ్యాయులు

ముదిగొండ: మండలంలోని వల్లబి, బాణాపురం, పెద్దమండవ, గంధసిరి, గోకినేపల్లి, తదితర గ్రామాల పాఠశాలలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. పలువురి ఉపాధ్యాయులను తమ సంఘంలోకి చేర్పించారు. కార్యక్రమంలో జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు, జిల్లా అసోషియేట్ అధ్యక్షులు అమృతకుమార్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురవయ్య, సాంబశివరావు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన వట్టికూటి రమేష్, అతని భార్య నీలిమ లపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్, నీలిమ మధ్య జరిగిన వివాదానికి సంబంధించి సర్ది చెప్పబోయిన గ్రామ మాజీ సర్పంచ్ కాంద్ర పిచ్చయ్యను అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేసి చంపుతామని బెదిరించారు. పిచ్చయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగులమీరా ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని శ్రీసాయి బాబా ఆలయాల్లో బాబాకి గురువారం ఆయా దేవాలయాల అర్చకులు స్వామికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. బాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేసి కర్పూర హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని శ్రీసాయి నిలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే సంక్షేమం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పెనుబల్లి: రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడ్డాకే పేదలకు అభివృద్ధి, సంక్షేమ పలాలు అందుతున్నాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. పెనుబల్లి మండలం పాత కుప్పెనకుంట్లలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ రాగమయితో కలిసి మంత్రి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలు, రైతులను విస్మరించగా, తాము అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడంతో పాటు రైతుల రుణ మాఫీ చేశామని తెలిపారు. అలాగే, సన్నధాన్యానికి బోనస్ ఇస్తున్నామని చెప్పారు. ఇప్పుడిప్పుడే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కుదుట పడుతున్నందున ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని వెల్లడించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల మాదిరి స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ప్రజలు అండగా నిలస్తే సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులు మరింత విస్తృతంగా జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా కందిమళ్ల వెంకట సత్యనారాయణకు కాంగ్రెస్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మార్కెట్ చైర్మన్, వైస్‌చైర్మన్లు భాగం నీరజాచౌదరి, రాజబోయిన కోటేశ్వరరావు, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, వెంకటేశ్వరరావు, కీసర శ్రీనివాసరెడ్డి, గుగులోతు మాధవరెడ్డి, పసుమర్తి విశ్వనాథ్, వంగా దామోదర్, సూరపురెడ్డి బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా నిర్మించాలి


మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ శ్రీనివాసరెడ్డి

చింతకాని: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా త్వరగా నిర్మించుకోవాలని హౌసింగ్ డీఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని జగన్నాధపురం రైతువేదికలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించిన లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే ఇసుక కూపన్ల ద్వారా ఇసుకను సమకూర్చుకోవాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, హౌసింగ్ మండల ఏఈ సుప్రియ, పందిళ్లపల్లి, బొప్పారం, జగన్నాధపురం, మత్కేపల్లి, గాంధీనగర్‌కాలనీ, తిరుమలాపురం గ్రామాల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన


బోనకల్: ముష్టికుంట్లలో శంకుస్థాపన చేస్తున్న ఎంపీడీఓ రమాదేవి


కారేపల్లి: సీతారాంపురంలో.. నాయకులు

ఎర్రుపాలెం/బోనకల్/చింతకాని/కారేపల్లి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగునంగా ఇళ్లను నిర్మించాలని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, ఎంపీడీఓలు సురేందర్, రమాదేవి, శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మంజుల తెలిపారు. గురువారం ఎర్రుపాలెం మండలంలోని పెద్దగోపవరం, బనిగండ్లపాడు, చొప్పకట్లపాలెం, బుచ్చిరెడ్డిపాలెం, కొత్తపాలెం, సఖినవీడు తదితర గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ రామకృష్ణలతో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్, ఎంపీడీఓ శంకుస్థాపన చేశారు. అదే విధంగా బోనకల్‌లోని.. ముష్టికుంట్లలో, చింతకాని మండలకేంద్రంలో, కారేపల్లిలోని.. సీతారాంపురం గ్రామాల్లో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరగా ఇళ్లు నిర్మించడం ద్వారా బిల్లులు త్వరగా వస్తాయన్నారు. ఈ కార్యక్రమాలల్లో పర్నాట్రస్టు చైర్మన్ పట్టాభిరామారావు, ఎస్సీసెల్ నాయకుడు జగన్నాథం, పంచాయతీ కార్యదర్శులు సైదులు, చరణ్, కాంగ్రెస్, సీపీఎం, టీడీపీ, బీఆర్‌ఎస్ నాయకులు పూర్ణచంద్రారెడ్డి, పిచ్చిరెడ్డి, కృష్ణారావు, శ్రీనివాసరెడ్డి, వేమిరెడ్డి త్రివేణి, బాబురావు, జానీబాషా, భాస్కర్‌రెడ్డి, భాస్కర్, శ్రీనివాసరావు, అరుణ, ఉపేందర్, విష్ణు, సురేందర్‌రెడ్డి, ఈర్యా, శ్రీను, పద్మ, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ప్రమీల, అనురాధ, సీతయ్య, కొరివి, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సిరిపురం మేజర్ కాల్వకు గోదావరి జలాలు


తల్లాడ: ఏన్కూరు మెయిన్ కెనాల్ వద్ద పూజలు చేస్తున్న నాయకులు

తల్లాడ/కల్లూరురూరల్: సీతారామ ప్రాజెక్ట్ ద్వారా విడుదలైన గోదావరి జలాలను ఏన్కూరు ప్రధాన కాల్వ 52వ కి.మీ. మీటర్ వద్ద గురువారం సాయంత్రం సిరిపురం మేజర్ కాల్వలోకి వదిలారు. ఈమేరకు ఎన్నెస్పీ అధికారులు పూజలు చేయగా, తల్లాడ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అయితే, ఏన్కూరు మెయిన్ కెనాల్‌కు 2వేల క్యూసెక్కుల నీరు సరఫరా జరిగితే సిరిపురం మేజర్‌కు చేరతాయని, ఇప్పుడు వెయ్యి క్యూసెక్కులే వస్తున్నందున పెంచాలని రైతులు కోరారు. కాగా, నీటి విడుదలపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు బాణాసంచా పేల్చగా ఖమ్మం నుంచి సత్తుపల్లి వెళ్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సన్మానించారు. నాయకులు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, రాయల రాము, జక్కంపూడి కిషోర్, గణేశుల రవి, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, బొడ్డు వెంకటేశ్వర్‌రావు, పొన్నం కృష్ణయ్య, పాల్గొన్నారు. కాగా, సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు కల్లూరు మండలం చిన్నకోరుకొండికి చేరగా రైతులు పూజలు చేశారు. నాయకులు, రైతులు ఎస్.కే.ఖాదర్, మందాడపు మురళి, కృష్ణారావు, ఈఊరి శ్రీనివాసరావు, పసుమర్తి చంద్రరావు తదతరులు పాల్గొన్నారు.

ఆలయంలో డిజిటల్ హుండీ ఏర్పాటు

కల్లూరురూరల్: మండలంలోని చిన్నకోరుకొండిలో గల శ్రీభ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో డిజిటల్ హుండీని గురువారం ఏర్పాటు చేశారు. ఓవర్సీస్ బ్యాంక్ వరంగల్ రీజినల్ మేనేజర్ ఋషి రంజన్, మార్కెటింగ్ మేనేజర్ ప్రతిమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ హుండీని ఆలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఈ హుండీలో ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా కానుకలు చెల్లించవచ్చాన్నారు. కార్యక్రమంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ కాశీవిశ్వనాద్, ఆలయ కమిటీ బాధ్యులు కేపీ శాస్త్రి, కమిటీ సభ్యులు రామారావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, మాజీ ఏఎస్ఐ రామారావు, సీహెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థి


సంతోష్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం సయ్యద్ సమద్, ఉపాధ్యాయులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మొగిలి సంతోష్ బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు హెచ్‌ఎం సయ్యద్ సమద్ తెలిపారు. ఎస్ఎస్‌సీ బోర్డ్ విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో 544 మార్కులు సాధించాడు. ఇతడు రెండో విడతలో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. దీంతో విద్యార్థిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు రియాజుద్దీన్, ఆదిశేషు కృష్ణ, రత్నారావులు అభినందించారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి


వైరాలో ప్రదర్శన నిర్వహిస్తున్న జర్నలిస్టులు

వైరా: ఈ నెల 24న వైరాలోని శబరి గార్డెన్స్‌లో జరిగే టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం వైరాలో పలువురు జర్నలిస్టులు ప్రదర్శన నిర్వహించారు. స్థానిక రింగ్ రోడ్డు సెంటర్ నుండి పాత బస్టాండ్ వరకు అక్కడి నుండి రింగ్ రోడ్డు వరకు ప్రదర్శన నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టీయూడబ్ల్యూజే ఎప్పుడు ముందుంటుందని పలువురు జర్నలిస్టులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కొత్తా వెంకటేశ్వరరావు, ఏపూరి రాజారావు, మోటపోతుల బాబూరావు, పులి కృష్ణార్జునరావు, గొల్లమందల విజయ్, ఎక్కిరాల శ్రీనివాసరావు, ఆదూరి ప్రేమ్‌కుమార్, మేరుగు కృష్ణ, గద్వాల రవీందర్, నల్లమోతు శ్రీనివాసరావు, సూతకాని శ్రీకాంత్, షేక్ అతావుల్లా, రేచర్ల నాగరాజు, అక్కిశెట్టి రవితేజ, సత్తెనపల్లి లక్ష్మణాచారి, డి రవితేజ, ప్రశాంత్, వినోద్, బాబు, సీతారాములు, రాజు, బాబూరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువులనే వాడండి


వైరారూరల్: అవగాహన కల్పిస్తున్న ఏఓ మయాన్ మంజుఖాన్

ఏన్కూరు: నానో ఎరువులను వాడి భూసారాన్ని పరిరక్షించుకోవచ్చని ఏఓ నర్సింహారావు తెలిపారు. గురువారం మండలంలోని ఆరికాయలపాడులో గ్రోమోర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. నానో ఎరువుల ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించుకోవచ్చని తెలిపారు. నానో ఎరువుల ఉత్పత్తుల వినియోగంతో సంప్రదాయ ఎరువులపై ఆధారపడే అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా మార్కెటింగ్ మేనేజర్ పొన్నం బాలకృష్ణ, స్టోర్ మేనేజర్ పునాటి రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీకాంత్, బాలకృష్ణ, లహరి, నవ్య, భవ్య పాల్గొన్నారు.

నానో యూరియా, డీఏపీ వాడకంపై అవగాహన
వైరారూరల్: మండలంలోని ఖానాపురం గ్రామంలో ఇఫ్‌కో కంపెనీ సహకారంతో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు నానో యూరియా, డీఏపీ వాడకంపై క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మయాన్ మంజుఖాన్ మాట్లాడారు. కార్యక్రమంలో ఇఫ్‌కో కంపెనీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మహేంద్ర రెడ్డి, మాజీ జెడ్పీకోఆప్షన్ సభ్యుడు షేక్. లాల్ మహ్మద్, ఏఈఓ సపావత్ సైదులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు

బోనకల్: మండలంలోని చిరునోముల, రావినూతల, తూటికుంట్ల గ్రామాల్లో అంతర్గత రహదారులు, సీసీ రోడ్ల నిర్మాణానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క నిధులు మంజూరు చేసినట్లు పీసీసీ మెంబర్ పైడిపల్లి కిషోర్ గురువారం తెలిపారు. చిరునోములకు 1.72లక్షలు, రావినూతలకు 1.62లక్షలు, తూటికుంట్లకు 66లక్షలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, ఆత్మాకమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, శాస్త్రీ, వెంకటేశ్వర్లు, లక్ష్మీనర్సయ్య డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రజెండాతోనే పేదలకు న్యాయం


మాట్లాడుతున్న హేమంతరావు

ముదిగొండ: ఎర్రజెండాతోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంతరావు అన్నారు. గురువారం ముదిగొండలో సీపీఐ సీనియర్ నాయకుడు పయ్యావుల లింగయ్య అధ్యక్షతన నిర్వహించిన సీపీఐ మండల 11వ మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం ఎర్రజెండా పోరాటాలు చేస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ దేశప్రజల క్షేమాన్ని విస్మరించిందన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన మండల కార్యదర్శిగా నాలుగోసారి రావులపాటి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికై య్యారు. ఈ సభలో సీపీఐ సీనియర్ నాయకులు ఎండీ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి సురేష్, నాయకులు జితేందర్ రెడ్డి, సలాం, గోవిందరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, రాంమూర్తి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్లు కల్పించాలి
ఎర్రుపాలెం: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు శీలం కవిత, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రం

సంక్షిప్త సమాచారం

లోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ పోటీ చేస్తుందని, ఆ దిశగా నాయకులు, కార్యకర్తలు ఇప్పటికే కార్యాచరణలో ఉన్నారని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని కోరారు. నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, మస్తాన్‌వలీ, తిరుపతిరావు, నరసింహారావు శ్రీనివాసరావు, కాశేశ్వరరావు, నాగేశ్వరరావు, హుస్సేన్, వెంకటేశ్వరావు, వెంకయ్య తదితరులున్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తల్లాడ: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. బాలపేట, అన్నారుగూడెం, గాంధీనగర్‌తండా, అంబేద్కర్ నగర్, అంజనాపురం, వెంగన్నపేట, రంగాపురం, కలకొడిమ గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో మండల వైద్యాధికారి రత్నమనోహర్ పరీక్షలు నిర్వహించి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పాత టైర్లు, కుండలు, జాడీలు, రోళ్లు, కూలర్లలో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం
ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురం, మేడేపల్లి, చిరుమర్రి, కట్టకూరు, ముదిగొండ పారిశ్రామిక ప్రాంతాల్లో నిర్వహించిన వైద్యశిబిరాల్లో వైద్యాధికారిణి అరణాదేవి రోగులను పరీక్షించి మందులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మదుసూదన్‌రావు, సూపర్‌వైజర్లు లత, పద్మావతి, పీహెచ్ఎన్ రాణి, ఏఎన్ఎం కృష్ణవేణి, నీలావతి, అరుణకుమారి, రత్నకుమారి, వసంత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నివాళి..
తల్లాడ: మండలంలోని నూతనకల్ గ్రామంలో గురువారం తూము రంగమ్మకు ప్రథమ వర్థంతి సందర్భంగా చిత్రపటం వద్ద మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగమ్మ సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో నూతనకల్ మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, లక్ష్మణ్‌రావు, లక్ష్మీనారాయణ, సీతారామిరెడ్డి, నాగేశ్వరరావు, వెంకన్న, పాపారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు సన్నాహాలు


మాట్లాడుతున్న ఎంఈఓ మురళీమోహన్‌రావు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం, బనిగండ్లపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఒక స్కూల్‌ను ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా ఎంపిక చేసేందుకు కసరత్తు జరుగుతున్నట్లు ఎంఈఓ బి.మురళీమోహన్‌రావు తెలిపారు. గురువారం మండలంలోని జమలాపురంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో, బనిగండ్లపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో తల్లిదండ్రులతో పేరెంట్స్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేశారు. కార్పొరేట్ స్కూళ్ల తరహాలో విద్యనందించే దిశగా సౌకర్యాలు, వసతులతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటవుతాయని తెలిపారు. పాఠశాలలను ఉన్నతాధికారులు సందర్శించిన అనంతరం తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఎంపిక ఫైనల్ అవుతుందన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు


బహుమతులు అందిస్తున్న వెంకటేశ్వరరావు

మధిర: మధిర డివిజన్ పరిధిలో 20024–25 సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. బుధవారం పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను మధిర డివిజన్ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ సహాయ సంక్షేమ అధికారి కె.వెంకటేశ్వరరావు అభినందించారు. మధిర బాలికోన్నత పాఠశాలకు చెందిన షేక్ హసీనా 524 మార్కులు సాధించగా రూ.2,016, వైరా విద్యార్థి వేణు(508).. రూ.1,016 ప్రోత్సాహక బహుమతులు అందించారు. కె.వెంకటేశ్వరరావు తన తండ్రి ముత్తయ్య జ్ఞాపకార్థం ఈ నగదు బహుమతి ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహించారు. అదేవిధంగా మధిర డివిజన్ పరిధిలో 9 వసతి గృహాల విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించినందుకు గాను, ఆయా వసతిగృహాల వార్డెన్లను సన్మానించారు. అనంతరం ఇటీవల తెలుగు వెలుగు సాహితీ వేదిక ద్వారా భారతరత్న పీవీ నరసింహారావు జాతీయ అవార్డు పొందిన కె.వెంకటేశ్వరరావును వసతి గృహ సంక్షేమ అధికారులు సన్మానించారు. ధనలక్ష్మి, నాగ శివ స్వప్న, కృతజ్ఞవేణి, హుస్సేన్, వెంకటేశ్వర్లు, జానీ బేగం పాల్గొన్నారు.

పలకలు పంపిణీ
సత్తుపల్లిరూరల్: స్వర్ణిక దివ్యాంగుల సేవా ఆశ్రమ ఆధ్వర్యంలో గురువారం ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు చేతుల మీదుగా జవహర్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్, వెంగళరావునగర్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పలకలు, స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వలపర్ల రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం
కొణిజర్ల: మండలంలోని అంజనాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బుర్రి జనార్థన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బీఆర్‌ఎస్ వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబు ఆ కుటుంబాన్ని గురువారం పరామర్శించి కర్మ కాండల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీను, రాంబాబు, బాలస్వామి, ప్రసాద్, పుల్లయ్య, గోపాల్ రామకృష్ణ, నరసింహారావు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధి సాధించాలి

చింతకాని: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యాభివృద్ధి సాధించాలని ఎంఈఓ సలాది రామారావు విద్యార్థులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని మత్కేపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన 150మంది విద్యార్థులకు.. ఖమ్మం నగరానికి చెందిన షేక్ రఫీ, ఉమారాణి దంపతులు స్కూల్ బ్యాగులు అందించడంతో పాటు పాఠశాలలో మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రఫీ, ఉమారాణి దంపతులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, బాబా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మంగమ్మ, ఉపాధ్యాయులు అనిత, ఉమామహేశ్వరరావు, సురేష్, నాగమణి, హసీనా, కవిత, శ్రీనివాసరావు, లక్ష్మి, రాణి పాల్గొన్నారు.

కప్పలబంధంలో రహదారి మరమ్మతులు

కల్లూరురూరల్: కల్లూరుకు సమీపంలోని కప్పలబంధం గ్రామంలో ప్రధాన రహదారి గోతులు ఏర్పడి రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. దీంతో గ్రామానికి చెందిన యువకుడు జిల్లెల్ల భాస్కర్‌రెడ్డి తన సొంత ఖర్చులతో రోడ్డుపై మొరం పోయించి రహదారిని తాత్కాలికంగా మరమ్మతు పనులు నిర్వహించారు. ఎవరో వచ్చి రహదారిని బాగు చేస్తారని ఎదురు చూడకుండా తన సొంతంగా రూ.5వేలు ఖర్చు చేసి రాకపోకలకు అనువుగా రహదారి మరమ్మతులు చేయించి భాస్కర్‌రెడ్డిని పలువురు అభినందించారు.